ప్రిక్వార్టర్స్‌కు త్రిసా-గాయత్రి ద్వయం

హాంకాంగ్: భారత యువ షట్లర్లు త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ ద్వయం హాంకాంగ్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌కు చేరింది. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరల్డ్ టూర్ సూపర్-500 ఈవెంట్‌లో భాగంగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా జాలీ-గాయత్రి జోడీ 21-14, 21-14తో పొలిన బుహ్రోవ-యెవ్హెనియ కంటెమిర్(ఉక్రెయిన్)ను ఓడించి ప్రిక్వార్టర్స్ చేరింది. అయితే పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరిన మానవ్ చౌదరి, చిరాగ్ సేన్ ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

నేటి నుంచి చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్‌కు బుధవారం నుంచి తెరలేవనుంది. కచ్చితంగా పతకం సాధిస్తారన్న అంచనాల మధ్య భారత ప్లేయర్లు ఈసారి బరిలోకి దిగుతున్నారు. మహిళల విభాగంలో హారిక, వైశాలి, దీవ్యాదేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ భారత్ తరపున టాప్‌సీడ్‌లుగా పోటీపడుతున్నారు. మరోవైపు ఓపెన్ కేటగిరీలో గుకేశ్, అర్జున్, విదిత్, హరి కృష్ణ రెండో సీడ్‌గా ఆడనున్నారు.

చాహల్ జోరు

నార్తాంప్టన్: టీమ్‌ఇండియా స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కౌంటీ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో భాగంగా నార్తాంప్టన్‌షైర్‌కు ఆడుతున్న చాహల్.. డెర్బిషైర్‌తో జరిగిన మ్యాచ్ లో ఐదు వికెట్లు (5/45)తో అదరగొట్టాడు. గత నెలలో కెంట్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ యుజీ ఐదు వికెట్ల (5/14) ప్రదర్శన చేశాడు. మొదట బ్యాటింగ్ చేసిన నార్తాంప్టన్‌షైర్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 219 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత చాహల్ స్పిన్ మాయతో డెర్బిషైర్ 165 పరుగులకే ఆలౌట్ అయింది.

'పారా' విజేతలకు నజరానా

స్వర్ణం గెలిచిన వారికి రూ.75 లక్షలు • చెక్కులు అందజేసిన కేంద్ర క్రీడాశాఖ మంత్రి

ఢిల్లీ: పారిస్ వేదికగా ఇటీవలే ముగిసిన పారాలింపిక్స్‌లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన విజేతలకు కేంద్ర ప్రభుత్వం నగదు పురస్కారాలు ప్రకటించింది. ఈ క్రీడలలో భారత్ తరపున బంగారు పతకం సాధించినవారికి రూ. 75 లక్షలు, వెండి వెలుగులు పంచినవారికి రూ. 50 లక్షలు, కాంస్యంతో మెరిసిన క్రీడాకారులకు రూ. 25 లక్షల నజరానా ప్రకటించింది. మిక్స్‌డ్ ఈవెంట్స్‌లో పతకాలు గెలిచిన ఆర్చర్లు రాకేశ్ కుమార్, శీతల్ దేవీకి తలా రూ. 22.5 లక్షల చొప్పున దక్కనుంది. ఈ మేరకు ఢిల్లీలో తనను కలిసిన పలువురు పారా అథ్లెట్స్‌ను సన్మానించిన అనంతరం కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ వారికి చెక్కులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాండవీయ మాట్లాడుతూ.. 'పారాలింపిక్స్‌లో భారత్ క్రమంగా పుంజుకుంటోంది. 2016లో 4 మెడల్స్ గెలిచిన దేశం.. టోక్యోలో 19 పతకాలు సాధించింది. తాజాగా దానిని 29కు చేర్చి పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది. పారా అథ్లెట్ల కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని వసతులూ కల్పిస్తోంది. 2028 లాస్‌ఏంజెల్స్ వేదికగా జరుగబోయే పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధిస్తాం' అని అన్నారు. పారాలింపిక్స్‌లో భారత్‌కు 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు దక్కిన విషయం (మొత్తం 29) తెలిసిందే.

వీరులకు ఘనస్వాగతం

పారాలింపిక్స్‌లో పాల్గొని పతకాల పంట పండించిన భారత పారా అథ్లెట్లు తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. ఆదివారం నాటికి ఈ క్రీడలు ముగిసిన తర్వాత అక్కడ మిగిలిపోయిన భారత బృందం మంగళవారం ఢిల్లీకి చేరుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఘన స్వాగతం లభించింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వందలాదిగా చేరుకున్న అభిమానులు.. అథ్లెట్లపై పూలు చల్లుతూ, స్వీట్లు తినిపించుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పతక విజేతలతో కలిసి సెల్ఫీలు దిగారు. స్వదేశానికి చేరుకున్న వారిలో సుమిత్ అంటిల్, హర్విందర్ సింగ్, శీతల్ దేవీ, నవ్‌దీప్ వంటివాళ్లు ఉన్నారు.

వ్రితికి రజతం

జాతీయ సీనియర్ స్విమ్మింగ్ టోర్నీ

మంగళూరు: మంగళూరు(కర్ణాటక) వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ రజత పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 400మీటర్ల ఫ్రీస్టయిల్ రేసులో వ్రితి 4:25:09 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటికే జాతీయ స్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన వ్రితి..అదే దూకుడు కొనసాగిస్తున్నది. ఇదే విభాగంలో పోటీపడ్డ హర్షిత రామచంద్ర(కర్ణాటక), భవ్య సచ్‌దేవ(ఢిల్లీ) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

హైదరాబాద్‌కు భారీ ఆధిక్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దిండిగల్(తమిళనాడు) వేదికగా జరుగుతున్న బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీ ఫైనల్లో హైదరాబాద్ భారీ ఆధిక్యం(517) దిశగా దూసుకెళుతున్నది. అనికేత్‌రెడ్డి (4/56), రోహిత్‌రాయుడు (3/36) ధాటికి చత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు కుప్పకూలింది. దీంతో 236 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన హైదరాబాద్‌ను జీవేశ్ (6/56) ధాటికి 281 పరుగులకు ఆలౌటైంది. రాహుల్‌సింగ్(68) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓవరాల్‌గా హైదరాబాద్ మ్యాచ్‌పై పట్టు కొనసాగిస్తున్నది.

చెన్నైలో ఐఆర్ఎల్ రేసింగ్

న్యూఢిల్లీ: రేసింగ్ ప్రియులను అలరించేందుకు మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ మళ్లీ సిద్ధమైంది. ఇండియన్ రేసింగ్ ఫెస్టివెల్(ఐఆర్ఎఫ్)లో భాగంగా ఈనెల 14, 15 తేదీల్లో ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ఎల్), ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్(ఎఫ్4ఐసీ) మూడో రౌండ్ పోటీలు జరుగనున్నాయి. గత వారం చెన్నైలో నైట్ స్ట్రీట్ సర్క్యూట్ రేసును విజయవంతంగా నిర్వహించిన ఉత్సాహంతో మూడో రౌండ్‌లో ఆరు జట్లకు చెందిన రేసర్లు అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 3.7కి.మీ కల్గి ఉన్న మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఇప్పటికే జరిగిన రెండు రౌండ్లలో జాన్ లాంకస్టర్, అలిస్టర్ యంగ్ విజేతలుగా నిలువగా, మూడో రౌండ్‌లో తీవ్ర పోటీ నెలకొన్నది. దీనికి తోడు ఫార్ములా-4లో యువ రేసర్లు సత్తాచాటాడం సంతోషంగా ఉందని ఆర్‌పీపీఎల్ ఎండీ అభిలేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ లీగ్ ద్వారా దేశంలో రేసింగ్‌ను ఆదరించే అభిమానుల సంఖ్య మరింత పెరిగిందని అన్నారు.

రెండో రోజూ అదే కథ

రద్దు దిశగా అఫ్గన్, కివీస్ టెస్టు?

రెండ్రోజులైనా ఒక్క బంతి పడని వైనం

వసతుల కొరతతో నెట్టింట రచ్చ రచ్చ

ఢిల్లీ: అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య ఢిల్లీకి సమీపంలో ఉన్న నోయిడాలో నిర్వహించతలపెట్టిన ఏకైక టెస్టు మ్యాచ్ రద్దు (?) దిశగా సాగుతోంది. ఈ నెల 9 నుంచి 13 మధ్య నోయిడాలోని షాహీద్ విజయ్ సింగ్ పతీక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈ టెస్టు జరగాల్సి ఉండగా మ్యాచ్ మొదలై రెండు రోజులైనప్పటికీ ఆటలో ఒక్క బంతి కూడా పడలేదు. ప్రస్తుతం నోయిడాలో వర్షాలు లేకున్నా గత వారం కురిసిన వానల కారణంగా స్టేడియంలో ఔట్ ఫీల్డ్ తడిగా మారింది. ఈ స్టేడియంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ లేనందున ఔట్ ఫీల్డ్ ఆరక రెండ్రోజులుగా మ్యాచ్ సాగకపోవడం ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు అభిమానులనూ నిరాశకు గురిచేస్తోంది. మూడో రోజూ ఇక్కడ మ్యాచ్ జరిగే పరిస్థితి లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేయడంతో పాటు ఇక నోయిడాలో అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వనున్నట్టు సమాచారం. ఐసీసీ మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వేదిక భవిష్యత్ ఆధారపడి ఉంది.

సోషల్‌మీడియాలో సెటైర్లు..

అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ఆ దేశ క్రికెట్ బోర్డు.. బీసీసీఐని సంప్రదించడంతో బోర్డు మూడు వేదికలను సూచించింది. నోయిడాతో పాటు బెంగళూరులోని చిన్నస్వామి, కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియాలను సూచించినా అఫ్గాన్ మాత్రం గతంలో తాము ఆడిన నోయిడానే ఎంచుకుంది. సదుపాయాల కొరతతో పాటు ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యంలో బీసీసీఐ ఇక్కడ దేశవాళీ మ్యాచ్‌ల నిర్వహణను 2019 నుంచే నిలిపేసింది. కాగా నోయిడాలో ఔట్ ఫీల్డ్‌ను ఆరబెట్టేందుకు అక్కడి సిబ్బంది ఉపయోగిస్తున్న ఫ్యాన్లు, గడ్డిని తవ్వుతూ ఆరబెడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అదీగాక ఇక్కడి క్యాటరింగ్ సిబ్బంది భోజనానికి ఉపయోగించే పాత్రలను టాయ్‌లెట్లలో కడుగుతున్న దృశ్యాలూ నెట్టింట వైరల్ అవడంతో నెటిజన్లు బీసీసీఐపై నిందలేస్తున్నారు. అయితే మ్యాచ్‌తో తమకేమీ సంబంధం లేదని బీసీసీఐ ప్రతినిధి ఒకరు చెప్పారు.

క్వార్టర్స్‌లో కార్తీక్ జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బాలీ(ఇండోనేషియా) వేదికగా జరుగుతున్న వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ సాయికార్తీక్‌రెడ్డి సత్తాచాటాడు. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో కార్తీక్ రెడ్డి, బొబ్రోవ్ బోగ్డాన్(రష్యా) ద్వయం 7-6(7-1), 6-1 తేడాతో సంజీవ్, వాన్ డాస్లర్(నెదర్లాండ్స్) జోడీపై గెలిచి ముందంజ వేసింది. మరోవైపు సింగిల్స్ తొలి రౌండ్‌లో కార్తీక్‌రెడ్డి 5-7, 3-6తో జెనియర్ టాంగ్వ్(స్విట్జర్లాండ్) చేతిలో ఓటమిపాలయ్యాడు.

చిత్రం

విశాఖలో యాక్షన్ షురూ

నాగార్జున ప్రస్తుతం వైజాగ్‌లో ఉన్నారు. అక్కడ ఆయన ఓ షూటింగ్‌లో బిజీబిజీగా గడుపుతున్నారు. ఆ షూటింగ్‌కి సంబంధించిన విజువల్స్ కూడా కొన్ని బయటకు వచ్చాయి. ఇంతకీ నాగ్ నటిస్తున్న ఆ సినిమా ఏంటి? అనే విషయానికొస్తే.. రజనీకాంత్ 'కూలీ' సినిమాలో నాగ్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగే ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్నది. ఇందులో నాగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. రజనీకాంత్‌తో ఢీ అంటే ఢీ అనే పాత్రలో నాగార్జున కనిపిస్తారట. రజనీకాంత్ 'వేట్టైయాన్' చిత్రం వచ్చే నెలలో విడుదల కానుంది. ఆ సినిమా తర్వాత 'కూలీ' వంతు. ఈ సినిమాకు లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

త్రిపాత్రాభినయంతో మెప్పిస్తా!

'దర్శకుడు ఈ కథ చెప్పి మూడు పాత్రలు పోషించాలని చెప్పినప్పుడు, ఇంత భారం మోయగలనా అని ఆలోచించాను. రెండు పాత్రలను వేరే వాళ్లతో చేయించొచ్చుగా అని అడిగాను. మూడూ నేనే ఎందుకు చేయాలో ఆయన వివరించి చెప్పారు. అప్పుడు కన్విన్స్ అయ్యాను. ప్రతిష్ఠాత్మక మైత్రీమూవీమేకర్స్ ఈ సినిమాను విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని హీరో టోవినో థామస్ నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'ARM'. ఐశ్వర్య రాజేశ్, కృతిశెట్టి, సురభి లక్ష్మీ కథానాయికలు. జితిన్‌లాల్ దర్శకుడు. లిస్టిన్ స్టీఫెన్ నిర్మాత. ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో టోవినో థామస్ మాట్లాడారు. 'ఈ సినిమాకోసం దర్శకుడు ఎనిమిదేండ్లు కష్టపడ్డారు. గ్రేట్ యాక్టర్ టివినో థామస్‌తో పనిచేయడం ఆనందంగా ఉంది. ఆయన నుంచి చాలా నేర్చుకున్నా. ఐశ్వర్య అద్భుతమైన నటి. మంచి టీమ్‌తో కలిసి పని చేశాను' అని కృతిశెట్టి ఆనందం వ్యక్తంచేసింది. ఇందులో జోది అనే పాత్ర చేశానని, ఈ సినిమా పెద్ద విజయం సాధించబోతున్నదని ఐశ్వర్య రాజేష్ నమ్మకం వెలిబుచ్చారు.

సికిందర్‌తో ఆటపాట

కథానాయిక కాజల్ అగర్వాల్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. గత కొన్నేళ్లుగా ఆశించిన విజయాలు దక్కకపోయినా ఈ భామ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణాదితో పాటు హిందీలో కూడా భారీ చిత్రాల్లో అవకాశాలను దక్కించుకుంటున్నది. తాజాగా ఈ అమ్మడు బాలీవుడ్‌లో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. 'సికందర్' చిత్రంలో సల్మాన్‌ఖాన్ సరసన నటించనుంది. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో పాన్ ఇండియా యాక్షన్ చిత్రంగా 'సికిందర్'ను తెరకెక్కిస్తున్నారు. సాజిద్ నడియావాలా నిర్మాత. ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా, మరో కీలక పాత్రలో కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు. సల్మాన్‌ఖాన్‌తో ఆమెకిది తొలి చిత్రం కావడం విశేషం. కథాగమనంలో కాజల్ అగర్వాల్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, త్వరలో ఆమె షూటింగ్‌లో జాయిన్ అవుతుందని మేకర్స్ తెలిపారు. సుదీర్ఘ విరామం తర్వాత బాలీవుడ్‌లో అగ్ర హీరో చిత్రంలో ఛాన్స్ దక్కించుకుంది కాజల్ అగర్వాల్. ఈ సినిమా బాలీవుడ్ కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని కాజల్ అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో 'కన్నప్ప' చిత్రంలో నటిస్తున్నది.

కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న

రూటెడ్ స్టోరీ ఇది

'ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడానికి ఏ ఎలిమెంట్స్ కావాలో తెలిసిన దర్శకుడు అర్జున్‌సాయి. నాటకరంగంపై రీసెర్చ్ చేసి ఆయన ఈ కథ రాసుకున్నారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న రూటెడ్ స్టోరీ ఇది. రంగస్థలం గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఇందులో ఉన్నాయి' అని రెజీనా కసాండ్రా అన్నారు. దిలీప్ ప్రకాశ్‌కు జోడీగా ఆమె నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సురేశ్ పాటిల్ నిర్మాత. ఈ నెల 13న విడుదల కానుంది. మంగళవారం రెజీనా విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో నేను కార్పొరేట్ ఎంప్లాయ్‌గా కనిపిస్తా. తనకి ప్రేమ మీద సదాభిప్రాయం ఉండదు. చాలా ఇండిపెండెంట్. కథలో కీలకమైన పాత్ర. ఈ పాత్ర చేయడం చాలా రీఫ్రెషింగ్‌గా అనిపించింది. నాజర్, ప్రకాశ్‌రాజ్ రంగస్థలం నుంచి వచ్చారు. వారితో వర్క్ చేయడం వల్ల చాలా నేర్చుకున్నా. వర్సటైల్ యాక్టర్‌గా ఉండాలనేది నా కోరిక. చేయగలిగిన అన్ని రకాల పాత్రలూ చేయడమే నా లక్ష్యం. ప్రస్తుతం సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న సినిమా చేస్తున్నా. హిందీలో ఇంకో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి' అని చెప్పింది రెజీనా.

భయాన్ని పరిచయం చేసే దేవర

'మనిషికి బతికేంత ధైర్యం చాలు.. చంపేంత ధైర్యం కాదు. కాదూ కూడదు అని మళ్లీ ఆ ధైర్యాన్ని కూడగడితే.. ఆ ధైర్యాన్ని చంపే భయాన్నవుతా..' ఈ డైలాగ్‌లోనే 'దేవర' సినిమా కథంతా ఉంది. 2 నిమిషాల 35 సెకన్లున్న ఈ థియేట్రికల్ ట్రైలర్ అదే చెప్పింది. మంగళవారం ముంబైలో ఎన్టీఆర్ 'దేవర' ట్రైలర్‌ను ఘనంగా విడుదల చేశారు. కరణ్ జోహార్, అనిల్ తడాని వంటి బాలీవుడ్ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఓ ప్రత్యేకమైన ప్రపంచం ఈ ట్రైలర్‌లో కనిపించింది. అభిమానులతో పాటు యాక్షన్ మూవీ లవర్స్ కోరుకునే అంశాలతో దర్శకుడు కొరటాల శివ ఈ ట్రైలర్‌ని తీర్చిదిద్దాడు. ప్రకాశ్‌రాజ్ వాయిస్‌ఓవర్‌తో ఈ ట్రైలర్ మొదలైంది. బైరా (సైఫ్ అలీఖాన్) తన క్రూరమైన గ్యాంగ్‌తో తీర ప్రాంతంలో అకృత్యాలకు తెగబడుతుంటాడు. ప్రశాంతంగా బతుకుతున్న తీరప్రాంత ప్రజల జీవితాల్లో అలజడి సృష్టించడమే కాకుండా, ఓడలను దోచుకుంటూ, కోస్ట్ గార్డులను చంపుతూ రక్తపాతాన్ని సృష్టిస్తుంటాడు. అలాంటి కరుడుగట్టిన రక్తపిపాసులకు భయాన్ని పరిచయం చేస్తాడు 'దేవర' (ఎన్టీఆర్). ఆ గ్రామాన్ని పెను ప్రమాదం నుంచి కాపాడతాడు. ఈ ట్రైలర్‌లో తారక్ స్క్రీన్ ప్రెజన్స్, డైలాగ్ డెలివరీ, ఎలివేషన్స్ గూజ్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. ఒకడు భయస్తుడుగా, ఒకడు భయాన్ని పరిచయం చేసేవాడుగా.. తారక్ రెండు రకాలుగా ట్రైలర్‌లో కనిపిస్తున్నాడు. తారక్, జాన్వీ కెమిస్ట్రీతోపాటు యాక్షన్ సన్నివేశాలకు అనిరుధ్ ఇచ్చిన ఆర్ ఆర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉంది. ఈ నెల 27 ఈ సినిమా తొలి పార్ట్ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, సమర్పణ: నందమూరి కల్యాణ్ రామ్.

'సర్వైవర్' నాకు స్పెషల్ మూవీ

రజత్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'సర్వైవర్'. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు, ఎడిటర్ కూడా ఆయనే కావడం విశేషం. కేన్స్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ ట్రైలర్, బెస్ట్ యాక్షన్ ఫిల్మ్ అవార్డులను అందుకున్న ఈ సినిమా డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, జియో సినిమాలో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా రజత్ రజనీకాంత్ మాట్లాడుతూ 'నేను చేసిన ప్రతి సినిమాకూ అవార్డులు వరించాయి. ఇందులో 'సర్వైవర్' ప్రత్యేకం. ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలందాయి. కథ, యాక్షన్ ఎపిసోడ్స్, నటన అన్నీ బాగా కుదిరాయి. ఇప్పుడు ఓటీటీలో కూడా బాగా ఆదరిస్తున్నారు. ఈ ఆదరణ వల్ల ఇక ముందు మంచి సినిమాలు చేయడానికి బలం చేకూరింది' అని చెప్పారు.

రివేంజ్ డ్రామా 'గాంధారి'

గత మూడేళ్లుగా తెలుగు సినిమాలకు బ్రేక్‌నిచ్చింది పంజాబీ సుందరి తాప్సీ. అయితే హిందీలో మాత్రం ఈ భామ ప్రయోగాత్మక కథాంశాల్లో నటిస్తూ సత్తా చాటుతున్నది. ఆమె తాజా హిందీ చిత్రం 'గాంధారి'కి సంబంధించిన అధికారిక ప్రకటన మంగళవారం వెలువడింది. బాలీవుడ్ నాయిక కనికా ధిల్లాన్ రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో తాను పూర్తి యాక్షన్ అవతారంలో కనిపిస్తానని, తన కూతురిని రక్షించుకోవడానికి ఒక తల్లి ఎంత దూరం వెళ్లింది, ఎలాంటి సాహసాలు చేసిందనే అంశాలు భావోద్వేగభరితంగా సాగుతాయని తాప్సీ తెలిపింది. 'దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత యాక్షన్ సీక్వెన్స్‌లో నటించబోతున్నా. 'గాంధారి' అద్భుతమైన స్క్రిప్ట్. ఓ తల్లి మానసిక వేదనకు, పోరాటానికి దృశ్యరూపంగా ఉంటుంది. ఇలాంటి ఇంటెన్స్ క్యారెక్టర్ కోసం చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నా' అని తాప్సీ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ప్రస్తుతం తాప్సీ బాలీవుడ్‌లో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని రామకృష్ణ గౌడ్

ఇటీవల జరిగిన తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల్లో ప్రతాని రామకృష్ణ గౌడ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా ఆరోసారి ఆయన ఈ పదవికి ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'భవిష్యత్తులో ఎన్నో మంచి కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నాం. ఇండస్ట్రీలోని 24 విభాగాల నుంచి ఈ ఛాంబర్‌లో 16 వేల మంది సభ్యులున్నారు. సినిమా ఔట్‌డోర్ షూటింగ్‌ల సమయంలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిన్న చిత్రాలకు రాయితీ ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం' అన్నారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఉపాధ్యక్షులుగా ఏ.గురురాజ్, డి.కోటేశ్వరరావు, జి.వరప్రసాద్, జనరల్ సెక్రటరీలుగా జె.వి.ఆర్.విద్యాసాగర్, కాచం సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా సోమిరెడ్డి, ఎం.బిందు, కోశాధికారిగా డా॥పి. ప్రకాష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎంపిక చేశారు. త్వరలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందని అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.